# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 02-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.
- ❖ రాష్ట్రవ్యాప్తంగా 28 లక్షల 62 వేల కుటుంబాలకు కుల ధ్రువీకరణ పత్రాలను అందజేశామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ వెల్లడించారు.
- ❖ అన్ని వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రజాహిత బడ్జెట్ ను ప్రవేశపెట్టిందని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.
- ❖ పాడిరైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

==============================

రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులో ఈ రోజు జరిగిన 'ది ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్' సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన యేల్చూరి వెంకటేశ్వర్లుకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నిరుద్యోగ సమస్య తగ్గాలంటే యువత ఉద్యోగాలతో పాటు వ్యాపారాల పైన దృష్టి సారించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఔత్సాహిక వ్యాపారులకు అన్నివిధాల అండగా ఉంటాయని కేంద్రమంత్రి పేర్కొంటూ.....

(వాయిస్ 33 సెకన్లు)

==============================

రాష్ట్ర వ్యాప్తంగా 28 లక్షల 62 వేల కుటుంబాలకు కుల ధ్రువీకరణ పత్రాలను అందజేశామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 34 లక్షల 37 వేల కుటుంబాల సమాచారాన్ని పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హులైన వారికి పత్రాలను అందించామని అన్నారు. పాఠశాల, కళాశాలల ప్రవేశాలకు, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల అమలుకు, ప్రభుత్వ పథకాలు అందిపుచ్చుకునేందుకు కులధ్రువీకరణ పత్రాలు వినియోగించాలన్నారు. వివిధ కారణాల రీత్యా ధ్రువీకరణ పత్రాలను పొందని వారు గ్రామ, వార్డు సచివాలయాలు లేదా ఏపీ

సేవా కేంద్రాల ద్వారా పునః దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తద్వారా రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి కుల ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారని మంత్రి తెలియజేశారు.

==============================

అన్ని వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రజాహిత బడ్జెట్ ను ప్రవేశపెట్టిందని పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరులోని భగత్ సింగ్ నగర్ లో 126 మంది లబ్ధిదారులకు మంత్రి ఈరోజు ఇళ్ల స్థలాల పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. ఎన్నికలలో ఇచ్చిన హామీలను దశలవారీగా ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పెన్నా నదిపై రెండవ వంతెన నిర్మాణం వల్ల నష్టపోయిన నిర్వాసితులకు రెండు సెంట్ల భూమిని ఇస్తున్నామన్నారు. అలాగే ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

==============================

పాడిరైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల గోడ పత్రికను మంత్రి ఈ రోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 30వ తేదీ వరకు పాడి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయడం జరుగుతుందన్నారు. పాడి రైతులందరూ పశువులకు ఎటువంటి వ్యాధులు సోకకుండా వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మంత్రి తెలియజేస్తూ....

(వాయిస్ 34 సెకన్లు)

విరామం

==============================

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఈనెల 17వ తేదీ నుంచి జరగనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ విద్యాశాఖాధికారులను ఆదేశించారు. పార్వతీపురంలోని కలెక్టర్ కార్యాలయంలో పదవ తరగతి పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ ఈరోజు శ్రవణమాధ్యమం ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవ తరగతి పరీక్షలకు 15 రోజులే గడువు ఉన్నందున, విద్యార్థులు బాగా చదువుకునేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని అన్నారు. అందుకు తగిన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 10 వేల 455 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారని, ప్రతి పరీక్షా కేంద్రంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు.

==============================

కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. గుంటూరులో ఆమె ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.. కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షించడానికి అభ్యర్థులు లేదా వారి ఏజెంట్లుగా నియామక పత్రం ఉన్నవారిని మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ఓట్ల లెక్కింపు కోసం... 700 మంది సిబ్బందిని కేటాయించామని కలెక్టర్ తెలుపుతూ.....

(వాయిస్ 34 సెకన్లు)

==============================

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7వ తేదీ వరకు మహిళా సాధికారత వారోత్సవాలు నిర్వహిస్తామని చిత్తూరు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వి.ఎన్.మణికంఠ చందోలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ రోజు జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో మహిళా ఉద్యోగులకు యోగ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మహిళా ఉద్యోగులకు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు, ఒత్తిడిని తగ్గించడానికి యోగా ఉపయోగపడుతుందన్నారు.

==============================

అనకాపల్లి జిల్లా ఏటికొప్పాక హస్తకళాకారులకు మరో ఘనత దక్కింది. రాష్ట్రపతి భవన్‌లో ఈ నెల 6 నుంచి నుంచి 9వ తేదీ వరకు జరిగే విద్యార్థి విజ్ఞాన్ మంథన్ - వి.ఎ.ఎం.2 కార్యక్రమానికి హాజరుకావాలని ఏటికొప్పాకలో లక్కబొమ్మలు తయారు చేసే కళాకారులు పెదపాటి సత్యనారాయణ శరత్‌కు కేంద్ర ప్రభుత్వం ఆహ్వానం పంపింది.

==============================

==============================